




చెలిమిచేను వద్ద బండరాళ్ళపై నుంచి జాలువారుతున్న జలాలు



కనువిందుగా చెలిమిచేను

రామకుప్పం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో కౌండిన్య అభయారణ్యంలోని జలపాతాలు హోరెత్తుతున్నాయి. ననియాలతండా, రామాపురంతండా, చిక్కపల్లితండా, వీర్నమల తండా, బల్ల అటవీ ప్రాంతాల్లోని వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెలిమిచేను, బడాలగుట్ట జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. చెలిమిచేను జలపాతం పైభాగంలో బండరాళ్ళను చీల్చుకుంటూ జలాలు ఉధృతంగా కిందకు జాలువారుతున్నాయి. పచ్చని కొండల మీదుగా సుమారు 200అడుగుల ఎత్తు నుంచి హోరు శబ్దాల మధ్య జలాలు కిందకు దుముకుతున్నాయి. జలపాతానికి ఇరువైపులా కొండలపై పరుచుకున్న పచ్చదనం వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది.

జలపాతానికి ఇరువైపులా కొండలపై పరుచుకున్న పచ్చదనం



31 మండలాల్లో వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో ఉపరితల ఆవర్తన కారణంగా గడిచిన 24 గంటల్లో బంగారుపాళ్యం మినహా 31 మండలాల్లో తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా నింద్రలో 83.4 మిమీ, అత్యల్పంగా పెద్దపంజాణిలో 2.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాల వారీగా కుప్పంలో 35.2, విజయపురంలో 34.4, నగరిలో 28.8, శ్రీరంగరాజపురంలో 26.8, పాలసముద్రంలో 26.6, గుడుపల్లెలో 23.6, సోమలలో 14.6, ఐరాలలో 13, శాంతిపురంలో 12.4, రామకుప్పంలో 12, కార్వేటినగరంలో 11.6, వెదురుకుప్పంలో 11.2, వి.కోటలో 11, పులిచెర్లలో 10.4, పుంగనూరులో 9.6, రొంపిచెర్లలో 8.6, సదుం, పూతలపట్టు మండలాల్లో 8.2, చౌడేపల్లెలో 7.6, గుడిపాలలో 6.8, పెనుమూరులో 6, చిత్తూరు రూరల్‌లో 5.8, తవణంపల్లెలో 5.6, చిత్తూరు అర్బన్‌లో 5, యాదమరి, గంగాధరనెల్లూరు మండలాల్లో 4.8, బైరెడ్డిపల్లిలో 4.6, గంగవరం, పలమనేరు మండలాల్లో 3 మిమీ వర్షం కురిసింది.



సోమల మండలంలో నేలవాలిన వరి పైరు

పంట నష్టం జరక్కుండా చూడండి:సీఎం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో పంట నష్టం జరక్కుండా చూడాలని సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగానికి సూచించారు.గురువారం దుబాయ్ నుంచి వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు నుంచి పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. నగరి మండలంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యిందని, ఎక్కడా వర్షపునీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సీఎం మాట్లాడుతూ అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని,విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని సూచించారు. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహాలతో చెరువులు నింపేందుకు చర్యలు చేపట్టాలన్నారు.



చౌడేపల్లెలో గురువారం సాయంత్రం కురుస్తున్న వర్షం

177 ఎకరాల్లో వరి పంటకు నష్టం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా జిల్లాలో 177 ఎకరాల్లోని వరి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖాధికారులు లెక్క కట్టారు. 12 మండలాల పరిధిలోని 32 గ్రామాల్లో 172 మంది రైతులు సాగు చేసిన వరి పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. అత్యధికంగా పెనుమూరు మండలంలో 70 ఎకరాల్లో పైరు దెబ్బతినగా, చౌడేపల్లె మండలంలోని ఒకే గ్రామంలో 40 ఎకరాలు, యాదమరి మండలంలోని ఐదు గ్రామాల్లో 12.25 ఎకరాలు సాగు చేసిన వరి పైరు దెబ్బతింది.

కరారి దంపతుల హత్యకేసులో

నేడు తుది తీర్పు

- 21మంది నిందితుల,122మంది సాక్షుల విచారణ
- పదేళ్ల విచారణ తరువాత వెలువడనున్న తీర్పు
- ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలతో పాటు 179మంది పోలీసులతో భారీ బందోబస్తు



కఠారి మోహన్, అనురాధ(ఫైల్‌ఫొటో)

చిత్తూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):పదేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అప్పటి చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త మోహన్ హత్య కేసుకు సంబంధించి శుక్రవారం తుదితీర్పు వెలువడనుంది. పదేళ్ల సుదీర్ఘ విచారణ తరువాత జిల్లా కేంద్రంలో ఉన్న ప్రత్యేక మహిళా న్యాయస్థానం ఈ కేసుకు సంబంధించిన తీర్పును వెలువరించనుంది.

2015 నవంబరు 17వ తేదీన ఉదయం చిత్తూరు నగరపాలక కార్యాలయం తుపాకుల కాల్పులతో, కత్తిపోట్లతో హోరెత్తింది.చిత్తూరు కార్పొరేషన్ తొలి మేయర్ అనురాధతో పాటు మున్సిపల్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడైన ఆమె భర్త కఠారి మోహన్ వారి ఛాంబర్లలో ఉన్నారు.ఇంతలో బురఖా ధరించిన కొంత మంది కత్తులు, తుపాకులతో కార్యాలయంలోకి వచ్చారు. మేయర్ అనురాధను ఆమె ఛాంబర్‌లో పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయారు.కాల్పుల శబ్దం విని వచ్చిన ఆమె భర్త కఠారి మోహన్ అక్కడి దృశ్యం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే దుండగులు కత్తులతో అతడి వెంటపడ్డారు.ప్రాణభయంతో కౌన్సిల్ హాలు గుండా పరుగెత్తగా కత్తులతో పొడిచి పారిపోయారు.తీవ్రగాయాలతో రక్తమోడుతున్న మోహన్‌ను వెంటనే వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించగా అదేరోజు సాయంత్రం ఆయన కూడా మృతి చెందారు.మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కఠారి మోహన్ మేనల్లుడు చింటూను ప్రధాన నిందితుడిగా చూపించిన పోలీసులు..ఈ జంట హత్యలకు సంబంధముందని 23 మందిని అరెస్టు చేశారు.వీరిలో శ్రీకాళహస్తికి చెందిన కాసరం రమేష్ అనే వ్యక్తికి హత్యలతో సంబంధం లేదని గతంలోనే న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. మరో నిందితుడు శ్రీనివాసాచారి కేసు విచారణలో ఉండగానే అనారోగ్యంతో మృతి చెందాడు. మిగిలిన 21మందిలో చింటూ ప్రధాన నిందితుడు కాగా వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేశ్, మురుగన్, యోగానంద్, పరంధామ, దాసు, మొగిలి, శశిధర్, యోగానందం, ఆర్వేటి బాబు, లోకేష్, రఘుపతి, నాగరాజు, ఆనంద్‌కుమార్, కమలాకర్, రజనీకాంత్, నరేంద్రబాబు, సురేష్ పేర్లను పోలీసులు ఛార్జ్‌షీట్‌లో దాఖలు చేశారు.ఈ పదేళ్ల కాలంలో మొత్తం 122 మంది సాక్షులను విచారించిన జిల్లా జడ్జి శ్రీనివాసరావు శుక్రవారం తీర్పు వెలువరించనున్నారు.



రక్తమోడుతున్న కఠారి మోహన్‌ను సీఎంసీ ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబీకులు



అనురాధ మృతదేహాన్ని చూసి కంటతడి పెడుతున్న అప్పటి జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి తదితరులు

200మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మేయర్ దంపతుల హత్య కేసుకు సంబంధించి శుక్రవారం తీర్పు వెలువడనున్న నేపథ్యంలో పోలీసుశాఖ అప్రమత్తమైంది. కోర్టు ఏ తీర్పు ఇచ్చినా...కోర్టు ఆవరణతో పాటు నగరంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్‌ఐలతో పాటు 179 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. వీరు కోర్టు ప్రాంగణంతో పాటు కఠారి కుటుంబం, చింటూ నివాసాలున్న గంగనపల్లె, ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తును నిర్వహించనున్నట్లు డీఎస్పీ సాయినాథ్ తెలిపారు.

వేడుకగా భాయ్ దూజ్ పండుగ



చిత్తూరు సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి విదియ రోజైన గురువారం చిత్తూరులో జైనులు భాయ్ దూజ్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.తమ సోదరులకు ఆడపిల్లలు భోజనాలు తినిపించి ఆశీర్వాదం తీసుకున్నారు.జిల్లా జైన్ సంఘం అధ్యక్షుడు సుభాష్ జైన్ తదితరులు ఈ వేడుకలో పాలు పంచుకున్నారు.

31.4 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

నగరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని తిరుపతి - తిరుత్తణి బైపాస్ రోడ్డులో మూతబడిన జారన్ జాయ్ హోటల్ పక్కన ఉన్న కాంపౌండ్‌లోని గోడౌన్‌లో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, సీఐ విక్రమ్ గురువారం స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ కాంపౌండ్‌లో ఎవరూ లేరని, బియ్యాన్ని మాత్రం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పోలీసులు ఆకస్మికంగా చేసిన దాడిలో బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. రేషన్ బియ్యాన్ని, అక్రమంగా రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్న నాలుగు వాహనాలు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. బియ్యం ఎవరెవరు ఎక్కడినుంచి తీసుకొస్తున్నారు, ఎవరెవరు అక్రమ రవాణా చేస్తున్నారనే విషయాలను ప్రత్యేక దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రిసెప్షన్‌కు రాని పెళ్లికొడుకు

పోలీసులను ఆశ్రయించిన వధువు బంధువులు

పాకాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రిసెప్షన్‌కు పెళ్లికొడుకు రాకపోవడంతో వధువు బంధువులు పోలీసు స్టేషన్‌కు పరుగులు తీసిన ఘటన ఇది. పాకాల మండలం దామలచెరువు పంచాయతీ పచ్చిపాలపల్లెకు చెందిన యువతికి బంగారుపాళ్యానికి చెందిన వరుడితో నిశ్చితార్థమయింది. గురువారం సాయంత్రం పాకాల సమీపంలోని ఆనందగిరి ఆలయ కళ్యాణ మండపంలో రిసెప్షన్, శుక్రవారం ఉదయం 9-10 గంటల నడుమ కల్యాణం జరగాల్సి ఉంది. రిసెప్షన్ వేడుకకు వధువు సిద్ధమై ఎదురు చూస్తుండగా వరుడు రాలేదు. దీంతో ఆందోళన చెందిన వధువు బంధువులు పెళ్లి కొడుకు కోసం గాలిస్తున్నారు. పాకాల పోలీసులను కూడా ఆశ్రయించారు.

తోటల్లోనే కుళ్లిపోతున్న టమోటా

సోమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో భారీగా నష్టపోతున్నామని సోమల మండల టమోటా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గార్గేయనదీ తీరంలోని రెడ్డివారిపల్లె, బోనమంద, చిన్నకమ్మపల్లె, పొలికిమాకులపల్లె గ్రామాల రైతులు టమోటాలను పుంగనూరు,పలమనేరు మార్కెట్లకు తరలించలేక నష్టపోతున్నారు.వర్షాలతో నాలుగు కల్వర్టులు కొట్టుకుపోవడంతో టమోటాలను తరలించలేకపోతున్నారు. దీంతో టమోటాలు తోటల్లోనే కాయలు కుళ్లి పోతున్నాయి.దీనికితోడు వర్షాలతో నల్ల మచ్చ వ్యాధి సోకి పంటనష్టం జరుగుతోంది. ఒకటి రెండుసార్లు కోతలు చేసినా ఆకులు రాలిపోతున్నాయి. ధరలు కూడా తగ్గిపోయాయి. 15 కిలోల బాక్సు రూ.150 నుంచి రూ. 200 లోపు మాత్రమే పలుకుతున్నాయి. పెద్దఉప్పరపల్లె, నెల్లిమంద. ఇరికిపెంట, నడింపల్లె, కందూరు ప్రాంతాల్లో టమోటా సాగు అధికంగా ఉన్నా. పెట్టుబడులు సైతం చేతికందే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి రైతులు కూడా వాన కారణంగా కోత కోయలేకపోతున్నారు. పలుచోట్ల వరి పంట నీటమునిగి కుళ్లిపోతోంది. కొందరు ఒబ్బిళ్లు చేసినా పంటను రక్షించుకోలేకపోతున్నారు.వరి మొలకలు వస్తున్నాయని ఆందోళన పడుతున్నారు.వేరుశనగ పంట కూడా పొలాల్లోనే మొలకవస్తోంది. ఇతర తీగ పంటలు, కూరగాయల పంటలకు కూడా నష్టమే వస్తోందని రైతులు వాపోతున్నారు.



టమోటాకు ఏర్పడిన నల్లమచ్చలు

ఆస్తి పన్ను చెల్లించమంటూ ఫేక్ ఫోన్‌కాల్స్

● ఫోన్‌పే, గూగుల్‌పే నుంచి పన్ను చెల్లించొద్దు: కమిషనర్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించాలని ఫోన్‌చేసే సైబర్ నేరగాళ్ల పట్ల పన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ చెప్పారు. ఇంటి, ఆస్తి పన్నులు చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌కాల్స్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పన్ను చెల్లింపుదారుల వివరాలు చెప్పి ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా డబ్బులు చెల్లించాలని మోసం చేస్తున్నారని, ఈ విషయంలో పన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పన్ను చెల్లించమని కమిషనర్, ఇతర అధికారులు ఎవరికీ నేరుగా ఫోన్ చేసి చెప్పరని, ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా పంపమని చెప్పే అవకాశమే లేదన్నారు. నగరపాలక పరిధిలో కొంత మంది పన్ను చెల్లింపుదారులకు ఫోన్ చేసి డబ్బులు కట్టమని చెబుతున్నారని చెప్పారు. 7013798610 నెంబరు నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయమై పన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఫేక్ ఫోన్‌కాల్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పన్ను చెల్లింపుదారులకు ఏదైనా సందేహాలున్నా.. పన్ను చెల్లించాలన్నా నగరపాలక కార్యాలయంలో, పురసేవ కేంద్రం, సీడీఎంఏ వెబ్‌సైట్, వార్డు సచివాలయ పరిధిలోని అడ్మిన్ కార్యదర్శిని సంప్రదించాలన్నారు.

23వ రోజుకు చేరిన పీహెచ్‌సీ వైద్యుల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు చేస్తున్న ధర్నా గురువారానికి 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శిరీష మాట్లాడుతూ గ్రామీణ వైద్యులపై పని ఒత్తిడి బాగా పెరిగిపోయిందని, అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం ప్రమోషన్లు ఇవ్వడం లేదని విమర్శించారు. తమ సమస్యలపై అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో గత 23 రోజులుగా జిల్లా వ్యాప్తంగా సమ్మె చేస్తున్నామన్నారు. కరోనా సమయంలో కూడా పీహెచ్‌సీ వైద్యులు ప్రాణం పెట్టి రోగుల ప్రాణాలను కాపాడామని, ఇప్పుడు తమ సమస్యను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం పోస్టులకు 2093 దరఖాస్తులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు 56 పోస్టులకు ఈ నెల 9వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 22న గడువు ముగిసింది. 56 పోస్టులకు గాను మొత్తం 2093 దరఖాస్తులు వచ్చినట్లు డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. మెడికల్ ఆఫీసర్లు 13 పోస్టులకు గాను 97 దరఖాస్తులు, స్టాఫ్ నర్స్ 20 పోస్టులకు 1374, ఫైనాన్స్ కమ్ లాజిస్టిక్ కన్సల్టెంట్ 1 గాను 45, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2, 3కు గాను 142, ఫిజియోథెరపిస్ట్ 1 పోస్టుకు గాను 50, శానిటరి అటెండెంట్ 2కు గాను 47, సపోర్టింగ్ స్టాఫ్ 4కు గాను 139, సెక్యూరిటీ గార్డ్ 2కు గాను 43, లాస్ గ్రేడ్ సర్వీసెస్ 8కి గాను 156, ఆడియో మెట్రి 2కు గాను ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఆమె తెలిపారు.

26న సీపీఐ జిల్లా సమితి సమావేశం

చిత్తూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా సమితి సమావేశం ఈ నెల 26వ తేదీన నగరంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి, పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాసంఘాలు, సీపీఐ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వరి పంటపై అడవి పంది దాడి


35.యర్లంపల్లెలో అడవిపంది నాశనం చేసిన వరి పంట

ఐరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 35.యర్లంపల్లెలో అడవి పంది వరి పంటపై దాడి చేసింది. గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి వరి పంట సాగు చేస్తున్నాడు. బుధవారం రాత్రి వర్షం కురుస్తున్నందున రైతు పొలం వద్దకు వెళ్ల లేదు. ఉదయం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి అడవి పంది పంటను నాశనం చేసినట్లు గుర్తించాడు. అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి అటవీ ప్రాంతం నుంచి అడవి జంతువులు పంట పొలాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాహనాల వేలం ద్వారా రూ.20.40 లక్షల ఆదాయం


వాహనాల వేలం నిర్వహిస్తున్న డీఎఫ్‌వో సుబ్బరాజు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వాహనాల వేలం ద్వారా అటవీ శాఖకు రూ.20.40 లక్షలు ఆదాయం సమకూరింది. జిల్లా అటవీ శాఖలోని పలు డివిజన్లలో వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను గురువారం స్థానిక డీఎఫ్‌వో కార్యాలయ ఆవరణంలో డీఎఫ్‌వో సుబ్బరాజు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. లారీలు, సుమో, కార్పియో, ఆటో, ద్విచక్రవాహనాలు మొత్తం 38 వాహనాలకు గాను 23 వాహనాలను వేలం వేయగా, మిగిలిన 15 వాహనాలను వివిధ కారణాలతో అధికారులు వేలం వేయలేదు. దీని ద్వారా అటవీ శాఖకు రూ.20.40 లక్షల ఆదాయం సమకూరింది. వేలం నిర్వహణలో చిత్తూరు తూర్పు, పశ్చిమ, పలమనేరు, పుంగనూరు, కుప్పం, కార్వేటినగరం సబ్‌డీఎఫ్‌వోలు, ఎఫ్‌ఆర్వోలు, టెండరుదారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ జర్నల్‌లో నగరి విద్యార్థుల వ్యాసం


విద్యార్థులను అభినందించి మెమెంటోలు అందజేస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

నగరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాసిన పరిశోధన వ్యాసం అంతర్జాతీయ జర్నల్ వరల్డ్ జర్నల్ ఆఫ్ ఫార్మస్యూటికల్ రీసెర్చ్ వాల్యూమ్ 14, ఇష్యూ 20లో ప్రచురించడం కళాశాలకే కాదు, నగరి ప్రాంతానికే గర్వకారణమని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించేలా పరిశోధనవ్యాసంరాసిన బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు జెన్సిష్ కుమార్, కీర్తి, గాయత్రి, రిషిత, ధనలక్ష్మిలను గురువారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రమోటింగ్ కమ్యూనిటీ హెల్త్ అవేర్‌నెస్ త్రూ స్టూడెంట్ లెడ్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ స్టడీ ఫ్రమ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(ఏ), నగరి పేరిట వ్యాసం రాశారని చెప్పారు. దానిని ఈ నెల 16వ తేదీన వచ్చిన అంతర్జాతీయ జర్నల్ అయిన వరల్డ్ జర్నల్ ఆఫ్ ఫార్మస్యూటికల్ రీసెర్చ్‌లో ప్రచురించినట్లు తెలిపారు. విద్యార్థులకు మార్గదర్శకురాలు డా.జి.స్వాతిని ప్రశంసించారు.

108 అంబులెన్స్ సర్వీసు మేనేజరుపై లైంగిక వేధింపుల కేసు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సహోద్యోగిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంపై 108 అంబులెన్స్ సర్వీసులో జిల్లా మేనేజరుగా పనిచేస్తున్న మోహన్‌బాబుపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు.. 108 అంబులెన్స్ సర్వీసులో పనిచేస్తున్న ఓ మహిళ పట్ల కొంత కాలంగా మోహన్‌బాబు అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగికంగా వేధిస్తున్నాడు. బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ పరికరాల కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగింది

ఎస్పీడీసీఎల్ సీఎండీకి ఏబీవీ ఫిర్యాదు


శివశంకర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏబీ వెంకటేశ్వరరావు, నలమోతు చక్రవర్తి తదితరులు

తిరుపతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ పరికరాల కొనుగోళ్ల వ్యవహారంలో భారీ అవినీతి జరిగిందంటూ ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయానికి వచ్చిన వెంకటేశ్వరరావు సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ ప్రతినిధులతో పాటు సీఎండీని కలిశారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో ఎప్పటి నుంచో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని, అయితే ప్రత్యేకించి 2023 నుంచీ భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విద్యుత్ శాఖలో రూ. 40 వేల కోట్ల విలువైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులో భారీ అవినీతి జరిగిందని, టెండర్లలో మోసాలు, అధిక ధరలు కోట్ చేయడం, టెక్నికల్ స్పెసిఫికేషన్ నిబంధనల ఉల్లంఘన వంటి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సమాచార హక్కు చట్టం కింద పలుమార్లు దరఖాస్తు చేసినా తమకు సమాచారం ఇవ్వలేదని కూడా సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నానని, ఫిర్యాదులోని అంశాలను పరిశీలించడానికి కొంత సమయం పడుతుందని సీఎండీ శివశంకర్ సమాధానమిచ్చారు. ఫిర్యాదులోని అంశాలు వాస్తవమని తేలితే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వెంకటేశ్వరరావు వెంట సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ ప్రతినిధులు నలమోతు చక్రవర్తి, డాక్టర్ బాబు సింగిరి నలగాంపల్లి సురేష్‌లు తదితరులు వున్నారు.

రాష్ట్రంలోనే అవినీతి సామ్రాజ్యంగా ఎస్పీడీసీఎల్

సదరన్ డిస్కం సీఎండీని కలిశాక, కార్యాలయం వెలుపల సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ వ్యవస్థాపకుడు నలమోతు చక్రవర్తితో కలసి ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోనే తిరుపతి కేంద్రంగా పనిచేసే ఎస్పీడీసీఎల్ అవినీతి సామ్రాజ్యంగా మారిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. సంతోషరావు సీఎండీగా వచ్చాకే భారీగా అవినీతి మొదలైందని ఆరోపించారు. అంతకుముందు అవినీతి ఉన్నా ఇంత స్థాయిలో లేదన్నారు. 'ఎస్పీడీసీఎల్‌లో కొన్నేళ్లుగా అవకతవకలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ విద్యుత్ పరికరాల కొనుగోళ్ళలో జరిగిన అవినీతికి సంబంధించి పూర్తి వివరాలను ప్రస్తుత సీఎండీకి అందజేశాం. ప్రజలకు తెలియాల్సిన వివరాలు సమాచార హక్కు చట్టం కింద పలు మార్లు కోరినా ఎస్పీడీసీఎల్ నుంచీ సమాధానం, సమాచారం రాలేదు. సెంటర్ ఫర్ లిబర్టీ వ్యవస్థాపకులు నలమోతు చక్రవర్తి చాలా కష్టపడి ఆధారాలు సేకరించారు. నెలన్నరగా ఆ విషయాలను ప్రజల ముందు పెడుతూ వస్తున్నాం. ఏ వైపు నుంచీ ఎక్కడా స్పందన లేదు. మా ప్రయత్నాల వల్లో లేక యాధృచ్ఛికంగానో సంతోషరావును ఇటీవలే ప్రభుత్వం సీఎండీ పోస్టు నుంచి రిలీవ్ చేసింది. మా ఫిర్యాదుపై ప్రస్తుత సీఎండీ శివశంకర్ సానుకూలంగా స్పందించారు. కొత్తగా వచ్చినందున ఫిర్యాదులోని అంశాలను పరిశీలించడానికి కొంత వ్యవధి తీసుకుని తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వర్గాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ విద్యుత్ వినియోగదారులే. ఎస్పీడీసీఎల్‌లో జరుగుతున్న అక్రమాలు ప్రజలందరిపై ప్రభావం చూపుతాయి. రూపాయి వస్తువును రూ.మూడుకు కొంటే ఆ తేడాను ప్రజలే భరించాల్సి వస్తుంది. ప్రజల నుంచి వసూలు చేసిన సర్‌ఛార్జీ రూ.900 కోట్లు తిరిగి చెల్లించడానికి కూడా ఎస్పీడీసీఎల్ వాయిదాలు పెడుతోంది. యూనిట్‌కు 11 పైసలు చొప్పున ఆరు నెలల్లో తిరిగి చెల్లిస్తామంటున్నారు. అలా చేసినా ప్రజలకు ఎంతో కొంత ఉపశమనం కలిగించినట్లే. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి' అని ఏబీ వెంకటేశ్వరరావు డిమాండు చేశారు. అలా చేయకుంటే తిన్నోళ్ళు తిని పారిపోతారని, ఆ డబ్బు ఇప్పుడైనా ఐదేళ్ల తర్వాతైనా చెల్లించాల్సింది ప్రజలేనన్నారు.

నేడు తిరుపతిలో రౌండ్ టేబుల్ సమావేశం

ఎస్పీడీసీఎల్‌లో అక్రమాలపై తిరుపతిలో శుక్రవారం ఉదయం 11 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని వెంకటేశ్వరరావు, నలమోతు చక్రవర్తి వెల్లడించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను ఆహ్వానించామన్నారు. ఎస్పీడీసీఎల్‌లో అక్రమాలపై తమ వద్ద నున్న పూర్తి వివరాలను సమావేశంలో వెల్లడిస్తామన్నారు. రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలతో పాటు బాధ్యత కలిగిన ప్రజలెవరైనా వచ్చి.. వారివద్దనున్న సమాచారం ఇవ్వొచ్చన్నారు.

గూడూరు విద్యుత్ స్టోర్స్‌లో ఇద్దరిపై వేటు

తిరుపతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి లోతేటి శివశంకర్ ఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టరుగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తన పనితీరెలా ఉంటుందో చాటుకున్నారు. గూడూరు మండలం నెల్లటూరులోని ఉమ్మడి నెల్లూరు జిల్లా విద్యుత్ స్టోర్స్‌లో అక్రమాలు జరిగాయని వచ్చిన ఫిర్యాదులపై ఆయన వేగంగా స్పందించారు. స్టోర్స్ ఏడీఈ పి.శంకరయ్య, ఏఈ బి.మల్లిఖార్జునను సస్పెండు చేశారు. ఈ వ్యవహారంతో సంబంధమున్న నెల్లూరు విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ విభాగ ఈఈ ఎస్.బాలచంద్రకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నెల్లటూరులోని ఈ స్టోర్ నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, జీఐ వైర్లు, ఇన్సులేటర్లు, కేబుల్ వైర్లు, ఎర్త్ వైర్లు తదితర పరికరాలు సరఫరా అవుతాయి. ఇందులో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. ప్రధానంగా గత నెలలో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ నుంచి స్టోర్స్‌కు సుమారు 30 టన్నుల జీఐ వైరు రాగా అందులో కొంత దుర్వినియోగమైనట్టు సమాచారం. ఈ ఫిర్యాదులపై తిరుపతి నుంచి అధికారులు వెళ్లి తనిఖీ చేయగా 5 టన్నుల జీఐ వైరు తక్కువగా ఉన్నట్లు గుర్తించారని తెలిసింది. ఈ విషయం సీఎండీ శివశంకర్ దృష్టికి పోవడంతో వెంటనే చర్యలు చేపట్టారు.

ఎల్లంకివారిపల్లెలో చోరీలతో కలకలం

● తాళం వేసిన ఇంట్లో 80 గ్రాముల బంగారం, వెండి, నగదు అపహరణ

● మొబైల్ దుకాణంలో చోరీ, మరో దుకాణంలో యత్నం

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లెలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వరుస చోరీలకు పాల్పడ్డారు. తాళం వేసిన ఓ ఇంట్లో 80 గ్రాముల బంగారు నగలు, 250 గ్రాముల వెండి నగలు, రూ.20 వేలు నగదును అపహరించారు. ఇదే ఊరిలోని ఓ మొబైల్ దుకాణంలో రూ.5 వేలు నగదు, మొబైల్ పరికరాలను దోచుకెళ్లారు. మరో మొబైల్ దుకాణంలోనూ చోరీకి ప్రయత్నించారు. ఈ వరుస చోరీ ఘటనలు గ్రామంలో కలకలం రేపింది. బాధితులు అబ్దుల్ మునాఫ్, పృథ్వీరాజ్ తెలిపిన కథనం మేరకు.. గ్రామానికి చెందిన అబ్దుల్ మునాఫ్ ఓ ప్రైవేటు పాఠశాలలో డ్రైవర్‌గా పనిచేస్తూ కళాశాల వీధిలోని ఓ అద్దె ఇంట్లో కాపురం ఉంటున్నాడు. గత సోమవారం రాత్రి తన ఇంటికి తాళం వేసుకొని భార్య, పిల్లలతో కలిసి తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లులోని తన అక్క ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం అబ్దుల్ మునాఫ్ తన ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉండటంతో ఆందోళనతో ఇంటి లోపలికి వెళ్లి పరిశీలించాడు. బీరువాలోని 80 గ్రాముల బంగారు నగలు, 250 గ్రాముల వెండి పట్టీలు, రూ.20 వేలు నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించాడు. తమ గదిలోని బెడ్ కింద దాచి ఉంచిన తాళాలతో బీరువాను తెరిచినట్లు తెలిపారు. ఇదే గ్రామంలోని పృథ్వీరాజ్‌కు చెందిన మొబైల్ దుకాణంలో దుకాణం పైన ఉన్న రేకులను తొలగించి మొబైల్ పరికరాలు, రూ.5 వేలు నగదును అపహరించారు. ఇదే గ్రామంలో సుధీర్‌కు చెందిన మరో మొబైల్ దుకాణంలో చోరీ చేసేందుకు దొంగలు ప్రయత్నించారు. వీలు కాకపోవడంతో వెనుదిరిగారు. ఈ వరుస చోరీల సంఘటనలపై గురువారం కల్లూరు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై కల్లూరు పోలీస్‌స్టేషన్ ట్రైనీ ఎస్ఐ మధు తన సిబ్బందితో సంఘటనా స్థలాలకు చేరుకుని చోరీలు జరిగిన తీరును పరిశీలించారు.


బంగారు నగలు చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

దేవళంపేటలో పంటలపై గజ బీభత్సం

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీలో బుధవారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. దీంతో వరి, కొబ్బరి, మామిడిచెట్లకు తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన ఏడు ఏనుగుల గుంపు గెండేవారిపల్లి మీదుగా నాయనిచెరువు వద్దకు చేరుకున్నాయి. మిట్టమీద రాచపల్లిలోని రైతు గిరికుమార్‌రెడ్డికి చెందిన అర్ధ ఎకరా వరిపంటను తొక్కేసిన ఏనుగుల గుంపు పంటలోనే పేడదిబ్బలు వేసి నానా బీభత్సం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. 25 ఏళ్ల కొబ్బరిచెట్టును కూకటివేళ్లతో పెకలించిన ఏనుగులు సమీపంలోని అరటిచెట్లను ధ్వంసం చేశాయి. రైతులు రమేష్, బాహూజికి చెందిన వరి పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతులు నరసింహులు, కృష్ణారెడ్డికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి ఆరు ఏనుగుల గుంపు వచ్చిన మార్గంలోనే తూర్పు విభాగం డవిలోని చింతలవంక వద్దకు చేరుకున్నాయి. ఇందులో మిగిలిన ఒంటరి ఏనుగు దేవళంపేట, తుడుంవారిపల్లి, కొంగరవారిపల్లి, గ్యాస్ గోడౌన్ మీదుగా కల్లూరు-పీలేరు హైవేను దాటుకుంది. పూరేడువారిపల్లి, పాతపేట మీదుగా పశ్చిమ విభాగం అడవిలోని పెద్దవంక వద్దకు చేరుకుంది. గురువారం పగలంతా చింతలవంకలో ఆరు ఏనుగుల గుంపు, పెద్దవంకలో ఒంటరి ఏనుగు సంచరిస్తున్నట్టు ప్రజలు తెలిపారు.


ధ్వంసమైన కొబ్బరిచెట్టు వద్ద గిరికుమార్‌రెడ్డి

రేపటిలోగా జాతీయ ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తుది గడువు శనివారమే. ఈ రెండు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, ప్రతిభావంతులైన విద్యార్థులు జాతీయ ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్ఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోండి. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఇప్పటివరకు జిల్లాలో 2,923 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

అర్హులు ఎవరంటే?

ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. ఓసీ, బీసీ విద్యార్థులు 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. అలాగే వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల్లోపు ఉండాలి. విద్యార్థులు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ. 50లు పరీక్ష రుసుం చెల్లించాలి.

180 మార్కులకు ప్రశ్నపత్రం


ప్రతిభా పరీక్ష డిసెంబరు నెలలో నిర్వహిస్తారు. కేంద్రప్రభుత్వం నిర్ణయించే తేదీన మూడు గంటలపాటు పరీక్ష జరుగుతుంది. మొత్తం 180 మార్కులకు రెండు విభాగాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. మెంటల్ ఎబిలిటీకి 90 మార్కులు, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి 90 మార్కులకు మల్టిపుల్ చాయిస్ రూపంలో ప్రశ్నపత్రం ఉంటుంది.



అలరించిన హరివిల్లులు

రామకుప్పం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కొళ్ళపల్లె పాలారు నది వద్ద గురువారం సాయంత్రం రెండు హరివిల్లులు కనువిందు చేశాయి. సాయంత్రం 4.30గంటలకు ఎండ మాయమై ఆకాశంలో మబ్బులు కమ్ముకోగా హరివిల్లులు కన్పించాయి. కొద్దిసేపటికి చిరుజల్లులు ప్రారంభం కావడంతో హరివిల్లులు అదృశ్యమయ్యాయి.

బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అమరనాథ్



పుంగనూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వెనుకబడిన తరగతుల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సదుం మండల టీడీపీ నాయకుడు గుండ్లపల్లి అమరనాథ్ నియమితులయ్యారు.వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని అమరనాథ్ తెలిపారు. సీఎం చంద్రబాబు , మంత్రి లోకేశ్, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

కల్తీ మద్యం పాపం వైసీపీ ప్రభుత్వానిదే

● ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం పాపం గత వైసీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతలు గత ఐదేళ్ళు కల్తీ మద్యం మాఫియా నడిపి , వేలకోట్లు దోచుకుని, ఇప్పుడు ఏమీ తెలియనట్లు కూటమి ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యం మద్యాన్ని అరికట్టే దిశగా ' ఏపీ ఎక్సైజ్ సురక్ష ' యాప్ తీసుకువచ్చారన్నారు.విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరుల్లో మద్యం పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు.

ఆ అర్హత జగన్‌కు లేదు:సీఆర్ రాజన్

కల్తీ మద్యం గురించి మాట్లాడే అర్హత మాజీ సీఎం జగన్‌కు లేదని టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లె ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా తయారైందన్నారు. గత వైసీపీ పాలనలో మద్యం మాఫియా నడిపి రూ.వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అందులో భాగమే ములకలచెరువు, ఇబ్రహీంపట్నం కల్తీ మద్యం అంశమన్నారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. టీడీపీ నేతలు మోహన్‌రాజ్, సునీల్, ధరణి, యువరాజులు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమం సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా షణ్ముగం


షణ్ముగంకు నియామక పత్రాన్ని ఇస్తున్న కృష్ణయ్య

చిత్తూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా షణ్ముగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం హైదరాబాదులోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో షణ్ముగంను జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ప్రకటించి నియామక పత్రాన్ని అందించారు. బీసీల సంక్షేమం కోసం చేసిన సేవలను గుర్తించి ఈ పదవిని ఇచ్చారని ఈ సందర్భంగా షణ్ముగం తెలిపారు. తనను నియమించినందుకు జాతీయ అధ్యక్షులు కృష్ణయ్య, జాతీయ కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల్లో పాడైపోయిన ఖర్జూరాల పంపిణీ


పురుగులు పట్టిన ఖర్జూరం

రామకుప్పం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తోంది. కాంట్రాక్టర్ల కక్కుర్తి కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. గత కొన్ని నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పాడైపోయిన ఖర్జూరాలను అంటగడుతున్నారు. పురుగులు పట్టిన ఖర్జూరాలు చేదుగా ఉండటతో తినలేక పడేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఖర్జూరాలు అందేలా చూడాలని కోరుతున్నారు.


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు


కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక నేతలు

రూ.3.46 కోట్లతో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పునర్నిర్మాణం

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో అనూహ్యమైన అభివృద్ధి పనులతోపాటు ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా ఆలయాల పునర్నిర్మాణాలు జరుగుతున్నాయని.. రామకుప్పంలో రూ.3.46 కోట్లతో వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగనున్నాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. గురువారం ఆలయ పునర్నిర్మాణ పనుల శంఖుస్థాపన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కుప్పం నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు హంద్రీ-నీవా కాలువతో కృష్ణాజలాలు తీసుకురావడం, భారీ వర్షాలు తోడవడంతో అన్ని చెరువులతోపాటు పాలారు నది పరవళ్లుతొక్కుతోందన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో మొదటి విడతలో రూ.54 కోట్లతో 11 ప్రముఖ ఆలయాల పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. రెండోవిడతలో గ్రామాల్లో టీడీపీ ఆధ్వర్యంలో 145 ఆలయాల పునర్నిర్మాణ పనులు చేసేందుకు సీఎం నిర్ణయించారని తెలిపారు. త్వరలోనే ఆ ఆలయాల పునర్నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. కుప్పం ప్రజల ఆరోగ్యపరిరక్షణ కోసం ఉచితంగా 46 రకాల రక్తపరీక్షలు నిర్వహించి వారికి అవసరమై వైద్యచికిత్సలు అందించే మహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటులో భాగంగా సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. త్వరలో కడతో గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఎల్ఈడీ, సోలార్ లైట్లు ఏర్పాటవుతాయని తెలిపారు. రామకుప్పం, శాంతిపురం మండలాల మధ్య ఎయిర్‌పోర్టు, అన్నిమండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ పెద్దలు సీతాపతి, చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, ఏఎంసీ మాజీ చైర్మన్లు చంద్రశేఖర్, సత్యేంద్రశేఖర్, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడు, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, కడ పీపీసీ సభ్యుడు రఘు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, తెలుగుయువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, క్లస్టర్ ఇన్‌చార్జీలు నాగభూషణ, రవిరెడ్డి, కో-ఇన్‌చార్జీలు కామరాజనాయక్, నవీన్, వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు మురళి, రెస్కో డైరెక్టరు విజయ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టరు పవన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్, మండలాధ్యక్షుడు హరీష్, బీజేపీ మండలాధ్యక్షుడు అంజనేయప్ప నేతలు గుర్రప్ప, నరసింహులు, గంట్లరెడ్డి, కొళ్ళపల్లెబాబు, నందారెడ్డి, సలాం సాబ్, రామలింగారెడ్డి, సురేష్, జయశంకర్, జేయి, మంజునాథరెడ్డి, టీవీ రవి, కృష్ణారెడ్డి, రామకృష్ణప్ప, అవినాశ్, బాలరాజు, సుబ్రీ, మంజునాథ్, పెరుమాళ్. మురళీమోహన్, రామాంజులు, భూపతి, భానుమూర్తి, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవాలు

రామకుప్పం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆలయ ఆవరణతోపాటు వెనుక భాగంలోని నక్షత్ర, రాశి, త్రిమూర్తి, నవగ్రహ వనాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీకమాసం పూర్తయ్యే వరకు రోజూ కార్తీక దీపోత్సం నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.


సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వెనుక వనాల్లో కార్తీక దీపాల వెలుగులు

ప్రభుత్వ పథకాలకు ఆధార్ ప్రామాణికం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలకు ఆధార్‌ను ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీవో రాజశేఖర్, ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విద్యార్థుల ఆధార్ ప్రత్యేక క్యాంపులపై డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లూరులోని వెంకటేశ్వర, జయకృష్ణ ఎల్లంకివారిపల్లిలోని అక్షర ఇంగ్లిష్ మీడియం పాఠశాలలతోపాటు ఎర్రపాపిరెడ్డిగారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈనెల 30 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐదేళ్ల నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థుల ఆధార్ అప్డేట్ కోసం తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో 450 మంది విద్యార్థులు ఆధార్ అప్డేట్ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విజిలెన్స్ తనిఖీలు


పాళెం పంచాయతీలో పనులను పరిశీలిస్తున్న విజిలెన్స్ బృందం

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో 2024-25 సంవత్సరంలో ఉపాధి పథకంలో చేపట్టిన పనులను గురువారం విజిలెన్స్ బృందం తనిఖీలు చేపట్టారు. ముందుగా కల్లూరు జడ్పీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న విజిలెన్స్ బృందం పనులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకొని పరిశీలించారు. అనంతరం పథకంలో జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీవో షౌకత్‌అలీ, జేఈ కృష్ణయ్య, టీఏలు మోహన్, మహేంద్ర, జ్యోతిరెడ్డి, కీర్తి, సుభాషిణి ఎఫ్ఏలు, విజిలెన్స్ బృందం పాల్గొన్నారు.

యువత శ్రమదానం


జీడిరేవుల వంక వద్ద కల్వర్టు దాటుతున్న ప్రయాణికులు

సోమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల కల్వర్టులు కొట్టుకుపోయాయి. అయినా ప్రజలు కల్వర్టు దాటుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రమాదం అని తెలిసి యువత కల్వర్టు వద్దనే ఉండి శ్రమదానంతో ఇసుక బస్తాలు కల్వర్టు ఏర్పాటు చేసి ప్రయాణికులను దాటిస్తున్నారు. సోమల-నంజంపేట మార్గంలోని జీడిరేవుల వంక వద్ద ఉధృతి తగ్గడంతో ప్రయాణం కొనసాగిస్తున్నారు. పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె, ఆవులపల్లె, చిన్నఉప్పరపల్లె పంచాయతీల్లో 100 గ్రామాల ప్రజలకు జీడిరేవు వంక కల్వర్టు ప్రధాన రహదారి కావడంతో నంజంపేట ఉపసర్పంచ్ ముబారక్, టీచర్ ఇమ్రాన్, వెంకటేశ్, రవికుమార్ తదితరులు కల్వర్టు వద్ద తాత్కాలిక పనులు చేపట్టారు. ప్రజలను దాటిస్తున్నారు. వాహన దారులు ఆ యువతను అభినందిస్తున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద పనులు చేపట్టాలని కోరుతున్నారు.

కేజీబీవీలో ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రామకుప్పం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం విజలాపురంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న గణిత శాస్త్ర ఉపాధ్యాయ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అమరావతి తెలిపారు. ఎంఎస్సీ బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు నేరుగా విద్యాలయ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె కోరారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేలు వేతనం అందించనున్నట్లు తెలిపారు.

హౌసింగ్ లబ్ధిదారుల ఎంపికకు పకడ్బందీ సర్వే

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో హౌసింగ్ లబ్ధిదారుల ఎంపిక కోసం శుక్రవారం నుంచి పకడ్బందీగా సర్వే నిర్వహించాలని శాంతిపురం ఎంపీడీవో కుమార్ కోరారు. గురువారం మండల సచివాలయంలో హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సొంతంగా ఇళ్ల స్థలాలు కలిగి బీపీఎల్ కుటుంబాలను అర్హులుగా గుర్తించి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేపై ఎటువంటి ఆరోపణలకు తావు లేకుండా చూడాలని ఆయన సూచించారు.

శాంతిపురంలో ఐదు ఆధార్ క్యాంపులు

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యార్థుల బయోమెట్రిక్ అప్డేట్ కోసం మండలంలో ఐదు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుమార్ తెలిపారు. శాంతిపురం వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్, రాయల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, తుమ్మిశిలోని నోబెల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, కూతేగానిపల్లె పరమహంస యోగానంద విద్యాలయం, కేపీ మిట్ట ఎంపీపీ స్కూళ్లలో శుక్రవారం ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సారా కేసులో ఒకరి అరెస్టు



చౌడేపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐదునెలల క్రితం నాటుసారా విక్రయిస్తూ పారిపోయిన కేసులోని వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో మండలంలోని దుర్గసముద్రానికి చెందిన శివకుమార్ సారా విక్రయిస్తుండగా దాడి చేయడంతో పారిపోగా గురువారం ట్రైనీ ఎస్ఐ మణికంఠేశ్వరరెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

తాళిబొట్టు విరాళం


తాళిబొట్టును విరాళంగా ఇస్తున్న ఆనందాచార్యులు

చౌడేపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ ఎస్ .అగ్రహారం గ్రామానికి చెందిన అర్చకులు ఆనందాచార్యులు, చాముండేశ్వరి దంపతులు అదే గ్రామానికి చెందిన చంద్ర కుమార్తెకు పెళ్లి కుదరడంతో వారికి రూ.15 వేలు విలువైన బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, పెళ్లి దుస్తులను గురువారం విరాళంగా అందించారు. పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కష్టపడే వారికే గుర్తింపు


సీఎం సహాయనిధి అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్

సోమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే వారిని ఆపదలో టీడీపీ ఆదుకుంటుందని సోమల ఏఎంసీ చైర్మన్ కరణం శ్రీనివాసులు నాయుడు అన్నారు. గురువారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో సీఎం సహాయనిధి మంజూరైన పొదలకుంటపల్లెకు చెందిన బాబురావుకు రూ.1,13,936, సూరయ్యగారిపల్లెకు చెందిన వి.భాస్కర్‌కు రూ.1,08, 100 చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయంపై అధికారుల్లో కదలిక

● భవనం మరమ్మతుకు కడా పీడీ ఆదేశం

కుప్పం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ గ్రంథాలయం విషయంలో ఎట్టకేలకు అధికారుల్లో పాక్షిక కదలిక ఏర్పడింది.'విజ్ఞాన భాండాగారంపై వీడని నిర్లక్ష్యం' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తాకథనంపై కడా పీడీ వికాస్ మర్మత్ స్పందించారు. గ్రంథాలయం పాత భవనాన్ని మరమ్మతు చేయాల్సిందిగా పంచాయతీరాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు.

కుప్పం పట్టణం నేతాజీ రోడ్డులోని ప్రభు త్వ గ్రంథాలయాన్ని గురువారం పంచాయతీరాజ్ శాఖ డీఈఈ సుబ్బారెడ్డి సందర్శించారు. భవనాన్ని పరిశీలించారు. పాత భవనంలో నడుస్తున్న గ్రంథాలయం రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉరుస్తోంది. ఇప్పటికే పెచ్చులూడి ఇనుప కమ్మీలు బయట పడిన పైకప్పు నుంచి మరికొన్ని పెచ్చులూడి మన్ను కిందకు రాలుతోంది. గ్రంథాలయంలోని విలువైన గ్రంథాలు తడిసిపోవడమే కాకుండా పాఠకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పురాతనమైన ఈ భవనం భారీ వర్షాలకు నేడో రేపో కూలేలా భయం గొలుపుతోంది. ఎమ్మె ల్సీ కంచర్ల శ్రీకాంత్, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ మునస్వామి బుధవారం గ్రంథాలయాన్ని సందర్శించి భవనం దుస్థితిని పరిశీలించి వెళ్లారు. గ్రంథాలయాధికారి సత్యవాణి వారికి ఉరుస్తున్న భవనం కారణంగా తాము పడుతున్న ఇబ్బందులు వివరించారు. ఈ మొత్తం వివరాలను తెలుపుతూ ఆంధ్రజ్యోతిలో గురువారం వార్తా కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై కడా పీడీ వికాస్ మర్మత్ స్పందించారు. భవనం పరిస్థితిని సమీక్షించి అవసరమైతే మరమ్మతు చేయాల్సిందిగా పంచాయతీరాజ్ డీఈఈ సుబ్బారెడ్డిని ఆదేశించారు. డీఈఈ మాట్లాడుతూ తాత్కాలికంగా భవనం ఉరవకుండా మరమ్మతులు చేయాలని కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశించారని.. ఆయన సూచనల మేరకు ప్రస్తుతానికి భవనం పైకప్పును శుభ్రం చేయించి, నీరు నిలువకుండా సిమెంటుతో మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తర్వాత దానిపై డ్యామ్ ప్రూఫ్ పెయింట్ వేయిస్తామని, దీంతో ఉరుపు తగ్గుతుందని చెప్పారు. అందుకు తగిన అంచనాలు తయారు చేయించి పీడీకి సమర్పిస్తామని, సాధ్యమైనంత త్వరలో పనులు ప్రారంభిస్తామని వివరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న పీఆర్ డీఈఈ సుబ్బారెడ్డి, లైబ్రేరియన్ సత్యవాణి తదితరులు

● మరమ్మతు చాలదు

పురాతనమైన గ్రంథాలయ భవనం చూసేందుకు ఓ ఆకారంలో కనిపిస్తోంది గాని అదింక ఏమాత్రం నివాసయోగ్యంగా లేదు. ఏ ఒక్కచోటనో కాకుండా దాదాపు పైకప్పు అంతటా పెచ్చులు ఊడి, ఇనుప కమ్మీలు బయట పడ్డాయి. నేడో రేపో కూలేంతగా భవనం దుస్థితిలోకి జారిపోయింది. మరోవైపు నేతాజీ రోడ్డు విస్తరణలో భవనంలో సుమారు అర్ధ భాగం పోతుంది. ఎక్కడో స్థలం చూసి నూతన భవనం నిర్మించి, అందులోకి గ్రంథాలయాన్ని మారుస్తామని పాలకులు, అధికారులు చెబుతున్నారు గాని అదిప్పట్లో జరిగే పని కాదు. కాబట్టి, ఆ నమూనా భవనం నిర్మించేలోపు ప్రస్తుతం నడుస్తున్న శిథిల భవనం నుంచి గ్రంథాలయాన్ని తాత్కాలికంగా మరోచోటుకు మార్చడమే తక్షణం చూపించాల్సిన పరిష్కారమని స్థానికులు చెబుతున్నారు. రేపు జరగరాని ప్రమాదం జరిగిన తర్వాత ఏం చేసినా ప్రయోజనముండదని వారు హెచ్చరిస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కొండతిప్పనపల్లెలో కొత్తగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. నెలరోజుల క్రితం ఎమ్మెల్సీ రాళ్లబూదుగూరు కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణం పనులు శంకుస్థాపనకు వచ్చారు. తమ గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నిర్మిస్తున్నామని టీడీపీ కార్యకర్త శంకరప్ప ఆయనకు తెలిపారు. దీంతో ఆయన గ్రామానికి వెళ్లి ఆలయ నిర్మాణ పనులు పరిశీలించి తన వంతుగా రూ.లక్ష విరాళం ఇస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు ఎమ్మెల్సీ గురువారం మండల నేతల సమక్షంలో శంకరప్పకు విరాళం మొత్తం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టీడీపీ మండలాధ్యక్ష, మాజీ అధ్యక్షులు నందిగం ఉదయ్‌కుమార్, విశ్వనాథనాయుడు, విండో అధ్యక్షుడు గోపాల్, నేతలు ఆర్ఎస్‌మణి, చంద్ర, నాగరాజు, మంజునాథ్, బాలకృష్ణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి

● కలెక్టర్ సుమిత్‌కుమార్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన శాంతిపురం మండలం సచివాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ప్రజల నుంచి వచ్చే వినతులపై సత్వరం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు మండల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశం అనంతరం కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమావేశంలో తహసీల్దారు శివయ్య, అధికారులు పాల్గొన్నారు.


'కల్తీ' ప్రచారాలతో అభివృద్ధిని అడ్డుకోలేరు

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పీఎస్.మునిరత్నం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ వాళ్లు కల్తీమద్యంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం విమర్శించారు. లేనిపోని అభూత కల్పనలతో చేస్తున్న 'కల్తీ' ప్రచారాలతో అభివృద్ధిని జగన్ అడ్డుకోలేరన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కల్తీ మద్యంపై జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. మద్యపాన నిషేధం చేస్తానని అధికారంలోకి వచ్చిన జగన్, దాన్నే ఆదాయంగా మార్చుకుని వేల కోట్ల రూపాయలు దోచుకోవడమేకాక, వేలాదిమంది ప్రాణాలను బలి తీసుకున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతో సొంత మద్యం బ్రాండ్లతో నాసిరకం కల్తీ మద్యం సరఫరా చేసి ప్రజల ఉసురు తీసింది మీరు కాదా అని నిలదీశారు. విశాఖలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ ఒప్పందంతో ప్రపంచ స్థాయిలో ఏపీ బ్రాండ్ మార్మోగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌ల సమర్థత, నైపుణ్యంతోనే అనేక ప్రపంచ స్థాయి కంపెనీలు ఏపీకి తరలివస్తున్నాయని చెప్పారు. సమావేశంలో కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, రామచంద్ర, కుప్పం మున్సిపల్, రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేశ్, రాజగోపాల్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు చేయాలి


ఎంపీడీవో ప్రసాద్‌కు విన్నవిస్తున్న జనసైనికులు

సోమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సోమల - పెద్దఉప్పరపల్లె ప్రధాన రహదారిలోని జీడిరేవుల వంకపై కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని గురువారం ఎంపీడీవో ప్రసాద్‌కు జనసైనికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జనసేన మండలాధ్యక్షుడు భూషన్ రాయల్ మాట్లాడుతూ సోమల మండల కేంద్రం నుంచి పెద్దఉప్పరపల్లె, నంజంపేట, చిన్నఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె, ఆవులపల్లె పంచాయతీలకు చెందిన గ్రామాల ప్రజలకు జీడిరేవుల వంకపై ప్రయాణం సాగిస్తున్నారని, వంకపై నిర్మించిన తాత్కాలిక వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిందని... అప్పటి నుంచి ఈ మార్గంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వంతెన కొట్టుకుపోయిందని.. శాశ్వత వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మురళీ, చాను, కల్యాణ్, సోము తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో విడవని వాన


మొరవ పోతున్న గౌను చెరువు

చౌడేపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లెలో గురువారం సాయంత్రం వరకు వర్షం కురిసింది. మండలంలోని చారాల చెరువు, శెట్టిపేట చెరువు, గౌను చెరువు, నాగప్ప చెరువు, పెద్ద చెరువులతో పాటు పలు చెరువులు మొరవలు పోతున్నాయి. గడ్డంవారిపల్లె రోడ్డులోని వర్షపు నీరు నిలిచి ఇళ్లల్లోకి చేరాయి. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మండల సమావేశం వాయిదా

గంగవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు గంగవరం ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండల సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు వేచిచూసినా మండలంలోని 16 మంది ఎంపీటీసీలకు గాను కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక మండల సమావేశం రద్దు చేస్తూ 24వ తేదీ శుక్రవారానికి వాయిదా వేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సోమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సోమల-సదుం మార్గంలోని బీవీఎస్ బాబు మామిడి తోట వద్ద అదుపుతప్పి కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు గాయపడినట్లు ఎస్ఐ శివశంకర తెలిపారు. సోమల వైపు నుంచి నంజంపేటకు వెళ్తున్న కారు సదుం నుంచి సోమల వైపు వెళ్తున్న ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ బోయకొండ, భార్య జయసుధ, కారు డ్రైవర్ మోహన్ గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థినుల ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల విభాగం టైక్వాండో పోటీలకు మండలంలోని కమ్మనపల్లె ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. పుత్తూరులో గురువారం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో కస్తూర్బా పాఠశాలకు చెందిన రోహిణి, లహరి, కుసుమ, హర్షిత, ఆదర్శ పాఠశాలకు చెందిన చందన ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపికైన విద్యార్థినులు ఈనెల 26 నుంచి 28 వరకు రైల్వేకోడూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు తొలగించాలి


మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న పార్థ తదితరులు

పలమనేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని గురువారం మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డికి ఎమ్మెల్యే వ్యక్తి గత సహాయకుడు పార్థతోపాటు పలువురు వినతి పత్రం అందజేశారు. పలమనేరులోని గడ్డూరు, గంటావూరు, కురప్పల్లి పేదల కాలనీల్లో కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు మరి కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని అక్రమ లే అవుట్లు వేసి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు.

కూటమి పాలనలోనే కాపులకు గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రాయల్

పుంగనూరు, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలోనే కాపు కులస్తులకు గుర్తింపు వస్తున్నట్లు రాయల్ పీపుల్స్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రాయల్ పేర్కొన్నారు. గురువారం పుంగనూరులో జరిగిన కాపు కులస్తుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కందుకూరులో బలిజ కులస్తులపై దాడులు జరిగితే ప్రభుత్వం వెంటనే స్పందించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ నాయకులు నానబాలకుమార్, చిన్నా, రాఘవ, జనార్దన్, మనోహర్ పాల్గొన్నారు.

గ్రామాలను సందర్శించిన వైద్యాధికారులు


దళవాయిపల్లెలో నీటిని శ్యాంపుల్ తీసుకుంటున్న వైద్యాధికారులు

గుడిపాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో కలుషిత నీటితో విష జ్వరాలు అన్నవార్తకు వైద్యాధికారులు స్పందించారు. మండలంలోని కొండాపురంలో బొమ్మసముద్రం వైద్య సిబ్బంది గురువారం సందర్శించి రక్త నమూనాలను సేకరించి, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాగునీటి బోరులో కలుషిత నీరు కలవడం వలన జ్వరాలు వచ్చాయని నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. అనంతరం గుడిపాల వైద్యాధికారులు దళవాయిపల్లె గ్రామాన్ని సందర్శించి వీధుల్లో పారిశుధ్య పనులు చేయించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాలసూర్యనారాయణ, హేమలత, ఉమామహేశ్వరి, చంద్రశేఖర్, శశికుమార్, రవితేజ, స్వప్న, భానుప్రకాష్ పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం


యువకుల శ్రమదానం

వెదురుకుప్పం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా ఇసుక, మట్టి రోడ్డుపైకి రావడంతో వెదురుకుప్పం మండలం మారేపల్లి కాలనీకి చెందిన యువకులు వాహన చోదకులకు ఇబ్బందులు కలగకుండా, ఆ మట్టిని ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగింపు చర్యలు చేపట్టారు. అదే విధంగా మరమ్మతులకు గురైన ప్రాంతాలను సరి చేయించే చర్యల్లో గురువారం నిమగ్నమయ్యారు. ఆ యువకులను స్థానికులు అభినందించారు.

గెస్టు లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

పాలసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు సబ్జెక్టు గెస్టు లెక్చరర్ పోస్టుకు ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమలత కోరారు. గెస్ట్ లెక్చరర్ అభ్యర్థి తెలుగు సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి, బోధన అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న ఉదయం 10.30 గంటలకు కళాశాలలో డెమో ప్రక్రియ ద్వారా అధ్యాపక బృందం కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేపడతామని ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పీజీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అటవీ జంతువుల వేటకోసం విద్యుత్ అమర్చేవారిపై కఠిన చర్యలు

బంగారుపాళ్యం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అటవీ జంతువుల వేట కోసం పంట పొలాల వద్ద 11 కేవీ విద్యుత్ వైర్లు అమర్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బంగారుపాళ్యం విద్యుత్ శాఖ ఏఈ దేవీప్రసన్న తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ బోడబండ్ల, బొమ్మాయిపల్లె, దండువారిపల్లె, వెలుతురుచేను, నలగాంపల్లె క్లస్టర్లలో 11 కేవీ నుంచి విద్యుత్‌ను అక్రమంగా తీసుకుని అటవీ జంతువుల వేటకోసం ఉపయోగిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి తమకు తెలిపితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

తవణంపల్లె, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కడపలో డిసెంబరు 6, 7 తేదీల్లో జరిగే సీపీఐ ఎంఎల్ లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలను, జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ కోరారు. గురువారం మండలంలోని కృష్ణాపురంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా నాయకులు మురళి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

3న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

నగరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నవంబరు 3వ తేదీన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నగరి నియోజకవర్గ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోదండయ్య పిలుపునిచ్చారు. నగరిలో గురువారం జరిగిన ఏఐటీయూసీ అనుబంధ సంస్థల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జీతాలు, అలవెన్సులు అన్నింటిని ప్రభుత్వం తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సతీష్, నాగరాజు, ఏసయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం


హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

విజయపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన విజయపురం ఎస్టీ కాలనీలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో వారం రోజుల్లో తాగునీటి పరిష్కారమైందని రాష్ట్ర బీసీ సెల్ టీడీపీ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్ అన్నారు. వారం రోజుల క్రితం ఎస్టీ కాలనీ వాసులు కోసలనగరం విచ్చేసిన ఎమ్మెల్యే భానుకు సమస్యను విన్నవించడంతో ఆయన కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రత్యేక నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో, ఎస్టీకాలనీ వాసులు ఎమ్మెల్యే, కలెక్టరుకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు శ్రద్ధ చూపాలని కేజీబీవీ డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు అన్నారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆయన జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణతో కలిసి స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జిల్లాలోని కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, వార్డెన్లతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ కేజీబీవీల్లోని విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు వారికి వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ప్రతి కేజీబీవీలోనూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విజయపథం, విద్యాశక్తి కార్యక్రమాలు పక్కాగా అమలుచేయాలని, ప్రతి పరీక్షకు సిలబస్ అంతా పూర్తి చేసి వారిని పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. కేజీబీవీల నిర్వహణపై ఏపీసీని అభినందించారు. సమావేశంలో జీసీడీవో ఇంద్రాణి, ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

చిత్తూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-పూతలపట్టు రైల్వేస్టేషన్ మార్గంలో చిత్తూరు సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ(55) గురువారం మృతి చెందింది. రైలు పట్టాలు దాటుతున్న సమయంలో తిరుపతికి వెళ్తున్న హౌరా ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆ మహిళ లేత ఎరుపు రంగు రెడ్ ఫ్లవర్స్ వున్న చీర, బ్రౌన్ కలర్ జాకెట్ ధరించి ఉన్నారన్నారు. మృతదేహం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉందని, మహిళ గురించి వివరాలు తెలిసిన వారు 86885 46060 నెంబరును సంప్రదించాలన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


కుప్పమ్మ (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు గురువారం తెలిపారు. సీఐ కథనం మేరకు... మండలంలోని బంగారుపాళ్యం దళితవాడకు చెందిన చిన్నబ్బ భార్య కుప్పమ్మ(60) నాలుగు రోజుల నుంచి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు రెడ్డెప్ప గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుప్పమ్మ ఆచూకీ తెలిస్తే ఈ 9030084041, 9963341458 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ చెప్పారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉల్లిపాయల లారీ బోల్తా



సాయిబాబా ఆలయం వద్ద బోల్తా పడిన ఉల్లిపాయల లారీ

నగరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలో సాయిబాబా గుడి సమీపంలో బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు ఉల్లిపాయల లారీ బోల్తా పడింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జాతీయ రహదారి పనులు కొనసాగుతుండడంతో లారీ అదుపు తప్పి బోల్తా పడింది.

వైభవంగా స్కందషష్ఠి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

నగరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కరకంఠేశ్వర స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో స్కందషష్ఠి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు, అర్చనలు చేశారు. అర్చకులు దుర్గాప్రసాద్ సుబ్రహ్మణ్యస్వామిని పుష్పాలతో అలంకరించి భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఏకాంబరకుప్పం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామి వారికి మహారాజ అలంకారం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పీసీసీ అధ్యక్షురాలిని కలిసిన నేతలు


పీసీసీ అధ్యక్షురాలికి సంతకాల సేకరణ పత్రాలను అందజేస్తున్న రమేష్‌బాబు, భాస్కర్

వెదురుకుప్పం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మను చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్, గంగాధరనెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటరు డి.రమేష్‌బాబు గురువారం విజయవాడలో కలిశారు. ఈక్రమంలో రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా చేపట్టిన ఓట్ చోర్ గద్దీ చోడ్ కార్యక్రమంలో భాగంగా జీడీనెల్లూరు నియోజకవర్గంలో సేకరించిన సంతకాలను ఆమెకు అందజేశారు.

ఆడపిల్లలకు భద్రత కల్పించండి


ఎస్పీని సన్మానిస్తున్న వైవీరాజేశ్వరి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కాలేజీలు, వసతి గృహాలలో ఉన్న ఆడ పిల్లలకు పటిష్ఠ భద్రత కల్పించాలని టీడీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి కోరారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తుషార్ డూడీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. అమ్మాయిల పట్ల కొంత మంది అనుచితంగా ప్రవర్తించడంతోపాటు అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద పోలీసుల గస్తీని పెంచాలన్నారు. రాత్రి వేళల్లో హాస్టళ్ల వద్ద పోలీసులు నైట్‌బీట్‌లు వెళ్లే విధంగా చూడాలని కోరారు.

లాడ్జీ, డాబాల్లో తనిఖీలు


లాడ్జీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై, సిబ్బంది

బంగారుపాళ్యం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లాడ్జీలు, హైవే పక్కన ఉన్న డాబాలపై గురువారం ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. లాడ్జీలలో అనుమానితులు ఎవరైనా ఉన్నారా, గదులు తీసుకునే వారి సమాచారాన్ని పరిశీలించారు. తప్పనిసరిగా గుర్తింపుకార్డులను తీసుకుని గదులు కేటాయించాలని యజమానులకు ఆయన సూచించారు. అలాగే హైవేల పక్కనే ఉన్న డాబాలను పరిశీలించారు. డాబాల్లో మద్యం విక్రయించడం, తాగడం చేస్తే చర్యలు తీసుకుంటామని, రాత్రి 10.30 గంటలలోపు డాబాలను మూసి వేయాలన్నారు. అనంతరం యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ కిరణ్, రమేష్, ధరణీ కుమార్ పాల్గొన్నారు.

వర్షపు నీటిని పరిశీలించిన కమిషనర్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సంతపేట లోతట్టు ప్రాంతాల్లో తాజా వర్షపు నీటి పరిస్థితిని కమిషనర్ నరసింహప్రసాద్ పరిశీలించారు. గురువారం నగరంలోని సంతపేటలో వర్షపునీరు రోడ్డుపైకి రాకుండా మళ్లించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పైపులైన్ కల్వర్టును పరిశీలించారు. నీటిమట్టం తగ్గినా.. మరింత తగ్గించేందుకు రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీని శుభ్రం చేయాలని ఆదేశించారు.





ఐరాల మండలం గుట్టకిందపల్లెలో వాలిపోయిన వరిపంట - గుడిపాల మండలం కోటూరులో నీట మునిగిన చామ పంట, బొమ్మసముద్రంలో కూలిపోయిన చంద్రావతి ఇల్లు - విజయపురం మండలం ఎల్లసముద్రం ఎస్టీకాలనీలో బురదమయంగా ఉన్న వీధి

నీట మునిగి మొలకెత్తిన వరి పంట

● లబోదిబోమంటున్న రైతులు

ఐరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గుట్టకిందపల్లెకు చెందిన పురుషోత్తం అనే రైతు వరి పంట నీటి మునిగిపోయి మొలకెత్తింది. ఎకరా పొలంలో పంట పూర్తిగా నీట మునిగిపోయింది. ఆరుకాలం కష్టపడి పండించిన పంట నీట మునగడంతో రైతు లబోదిబోమంటున్నాడు. చేతికందిన పంట నోటికందలేదని వాపోతున్నాడు. తన కష్టాన్ని గుర్తించి కూటమి ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన వేడుకుంటున్నాడు. సుమారు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లిందని ఆయన తెలిపాడు. అలాగే మండల వ్యాప్తంగా 112 హెక్టార్లలో రైతులు వరి పంటను సాగు చేశారు. ఇందులో పలు గ్రామాల్లో సుమారు 80 హెక్టార్ల మేర వరి పంట నీటి పాలైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తిగా వర్షం తగ్గిన అనంతరం నీటి మునిగిన వరి పంటలను అధికారులు లెక్కించనున్నట్లు సమాచారం. మండల వ్యాప్తంగా గత శుక్రవారం 28.8 మి.మీ, శనివారం 8.2, ఆదివారం 12.6, మంగళవారం 13.2, బుధవారం 59.6, గురువారం 13.0 మి.మీల వర్షపాతం నమోదైంది. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 135.4 మి.మీ వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు.

● గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రంలోని చంద్రావతికి చెందిన ఇల్లు నేల కూలింది. ఆ సమయానికి ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. భారీ వర్షం కారణంగా కోటూరు గ్రామానికి చెందిన వాసురెడ్డి ఆరు ఎకరాల్లో పండించిన చాయ, గుమ్మడి కాయల పంట పూర్తిగా నీట మునిగింది. దీంతో సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలిన ఇంటికి తగిన నష్ట పరిహారాన్ని అందిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ చెప్పారు.

● విజయపురం: మండలంలోని ఇష్టకామేశపురం చెరువు మొరవ పారడం వలన తిరుత్తణి - నాగలాపురం రోడ్డు మార్గమధ్యంలో గొల్లకండ్రిగ దళితవాడ వద్ద వరవకాలువ పూడిపోవడంతో వర్షపునీరు పొలంలోనే ఉండి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తూము ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో ఆక్రమణల వలన కాలువలు పూడిపోవడంతో వర్షపునీరు ఇంటిలోకి చేరుతున్నాయని, అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షపునీటిని బయటికి తోడుతున్నారు. వర్షపునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేంద్ర పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఒరూరు, కాళికాపురంలో వరి పంట నీట మునిగింది.

● గంగాధరనెల్లూరు: కురుస్తున్న వర్షాలతో రైతులు, ప్రజలు నానావస్థలు ఎదుర్కొంటున్నారు. తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలోని తాజర్‌అలీకి చెందిన వేరుశనగపంట వర్షం నీటిలో నానుతోంది. తూగుండ్రంలో కొలిమి పని చేసే మణి ఆచారి ఇంటి సమీపం వరకు, పాతవెంకటాపురం పంచాయతీ గరిగలపల్లెలో రాధాక్రిష్ణమనాయుడు ఇంటివరకు వర్షపునీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే గ్రామంలోని గుర్రప్ప నాయుడుకు చెందిన వరిపైరు కోతకు వచ్చినా ఒబ్బిడి చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది.





విజయపురం మండలం ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో ఇంటిలో నుండి వర్షపు నీటిని బయటికి తోడుతున్న యజమాని, ఒరూరులో నీట మునిగిన వరి పంట - ఆవలకొండలో నీటిలో నానుతున్న వేరుశనగపంట, గరగలపల్లెలో రాధాకృష్ణమనాయుడు ఇంటికి వద్దకు చేరిన వర్షపునీరు


కుశస్థలీనదిలో ఉధృత ప్రవాహం

- ద్విచక్ర వాహనదారులకు తిప్పలు


వంతెన దెబ్బతినడంతో తిప్పలు పడుతున్న ద్విచక్ర వాహనదారులు

నగరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరి నుంచి కీళపట్టుకు వెళ్లే మార్గంలో కుశస్థలీనదిలో గురువారం వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా వరద రావడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన వంతెన దెబ్బతింది. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు వరద వచ్చింది. అనంతరం వరద తగ్గుముఖం పట్టడంతో ద్విచక్ర వాహనదారులు అటు వైపు వెళ్లగా వంతెన దెబ్బతినడంతో ఇబ్బందులు పడ్డారు. శాశ్వత వంతెన నిర్మాణం చేపడితేనే ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు ఉండవని స్థానికులు పేర్కొంటున్నారు.

పట్టించుకోండయ్యా..!


నచ్చుకూరు సమీపంలో అమ్మచెరువు వద్ద ఇలా..

వెదురుకుప్పం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కురిసిన వర్షాలతో వెదురుకుప్పం మండలం నచ్చుకూరు సమీపంలో ఉన్న అమ్మచెరువు నిండిపోయి కలుజు పారుతోంది. అయితే కలుజు పారే చోట కొట్టుకునే పోయే ప్రమాదం పొంచి ఉంది. ఇది కొట్టుకుపోకముందే చర్యలు చేపట్టాలని స్థానికులు మండల స్థాయి అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గురువారం తెలిపారు. ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చినా వెదురుకుప్పంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

నిండిన చెరువులు


నిండిపోయిన మహదేవమంగళం చెరువు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గంగాధరనెల్లూరు మండలంలోని చిన్న, పెద్దచెరువులు నిండాయని ఇరిగేషన్‌శాఖ ఇరిగేషన్‌శాఖ డీఈ జయచంద్రబాబు, ఏఈ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చిన్న, పెద్దచెరువులు 112కు గాను ఇప్పటి వరకు 23 చెరువులు నిండగా, మిగిలిన 89 చెరువుల్లో 50 నుండి 75 శాతం మేర నిండాయని చెప్పారు. వర్షాలు మరో వారం రోజులపాటు కురిస్తే మిగతా చెరువులు కూడా నిండిపోయి మొరవలు సాగగలవని అన్నారు. వాతావరణశాఖ హెచ్చరికలతోపాటు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారంలో రెండురోజులపాటు చెరువులను పరిశీలించి, భద్రత పరంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో పాటు ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులకు నివేదికలను ఆన్‌లైన్‌లో పంపిస్తున్నామన్నారు.

పోలీసు అమరవీరులను స్మరించుకుందాం


నగరిలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నగరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరులను స్మరించుకుందామని సీఐ విక్రమ్ అన్నారు. గురువారం డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ పర్యవేక్షణలో పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ పట్టణంలోని ఓం శక్తి గుడి సమీపంలోని బైపాస్ సర్కిల్‌నుంచి టవర్‌క్లాక్ వరకు పోలీసులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పోలీసు సిబ్బందికి నివాళులర్పించడంతో పాటు, ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడటానికి వారు చూపిన సేవా భావాన్ని స్మరించుకోవడమే ఈ దినోత్సవ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ విజయ నాయక్, సిబ్బంది, మహిళా పోలీసులు, సాంఘిక సంక్షేమ హాస్టల్‌లోని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు



చిత్తూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంఎస్ఆర్ థియేటర్ వద్ద కేక్‌కట్ చేసి అభిమానులకు, ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేసి నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తులసీకృష్ణ, శ్రీధర్, సద్దాం, వేణు, సాధిక్, తేజ, సంతోష్, జన, బాలాజీ, అజాద్, వినోద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నిండ్ర తహసీల్దార్‌గా ఈశ్వరయ్య


తహసీల్దార్‌ని సన్మానిస్తున్న నిండ్ర మండల టీడీపీ నాయకులు


నిండ్ర, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నిండ్ర తహసీల్దార్‌గా ఈశ్వరయ్య గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న శేషగిరిరావు బదిలీపై జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. వెదురుకుప్పం మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఈశ్వరయ్య బదిలీపై నిండ్రకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను నిండ్ర పీఏసీఎస్ చైర్మన్, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్ నాయుడు, రైతు విభాగ నాయకుడు బాబు యాదవ్, నగరి ఏఎంసీ డైరెక్టర్లు నాగభూషణం రాజు, జగన్, రవిరాజు, నాయకులు గిరిబాబు, విజయకుమార్ నాయుడు, పురుషోత్తం నాయుడు, భాస్కర్, పరదేశి, శరవణ, ప్రకాష్, మనోహర్ నాయుడు, జయచంద్ర నాయుడు, ప్రసాద్‌రెడ్డి తదితరులు సన్మానించారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్ గుర్రప్పను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండల కొత్త తహసీల్దార్‌గా గురువారం ఎన్ఎం.గుర్రప్ప బాధ్యతలు స్వీకరించారు. ఈయన కలెక్టరేట్ నుంచి బదిలీపై పాలసముద్రం తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన అరుణకుమారిని కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన గుర్రప్పను డీటీ రుషివర్మ, ఆర్ఐ దేవి, టీడీపీ చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి వాసునాయుడు, టీడీపీ నాయకులు తంగరాజ్, జె.విజయ్‌కుమార్, రవినాయుడు, బాబు యాదవ్ శాలువ కప్పి సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయన నగరి ఆర్డీవో అనుపమను మర్యాద పూరకంగా కలిశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పీసీఎన్ విద్యార్థి


దామును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

నగరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు నగరి పీసీఎన్ జూనియర్ కళాశాలకు చెందిన దాము ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటాచలపతి తెలిపారు. అక్టోబరు 27వ తేదీ నుంచి తూర్పుగోదావరి జిల్లాలో జరగబోయే వాలీబాల్ పోటీలకు ఎంపికైన దామును ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది గురువారం అభినందించారు.